క్లుప్తంగా

అల్తాఫ్ రజాకు పెన్షనర్ల సన్మానం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వరద బాధితులను అన్నదానంతో ఆదుకున్న షాబూఖారీ దర్గా ఆస్థాన పీఠాధిపతి మహ్మద్ అల్తాఫ్ రజాను రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం సత్కరించారు. బాధితులకు మూడు పూటలా ఆహార పదార్థాలు అందజేయడం అభినందనీయమని వారు కొనియాడారు. అసోసియేషన్ చైర్మన్ వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా, సభ్యులు శ్యాంబాబు, హనుమంతరావు, చిన్నమస్తాన్ పాల్గొన్నారు.

నగదు బహుమతులు అందజేత



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): స్థానిక జెడ్పీ పాఠశాల బాలికలు చదువులో చూపిన ప్రతిభ ఆధారంగా పెట్ల పార్వతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగదు బహుమతులు మంగళవారం అందజేశారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు 17 మంది బాలికలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులను ట్రస్ట్ గౌరవ అధ్యక్షురాలు దేవినేని జోసీకుమారి, డాక్టర్ మామిడి సీతారామారావు అందజేశారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం బి.పద్మలత, తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీదారుల అరెస్ట్



తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ సర్కిల్‌లోని పలు గ్రామాల్లో అధికారులు దాడులు నిర్వహించారు. గంపలగూడెం మండలం పెదకొమెర, అమ్మిరెడ్డిగూడెం గ్రామాల్లోని సారా బట్టీల్లో 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పెదకొమెరలో గుంజి అశోక్, గుంజి గోపీల నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు. నిందితులను గంపలగూడెం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

తిరువూరు: ఎస్‌ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో మల్లేల గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ముగ్గురు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులు, జూదరులపై కేసు నమోదు చేశారు.

ఫిజియో థెరపీ



ముసునూరు: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు ముందడుగు వేయాలంటే వారికి మన ఆదరణ అవసరమని హెచ్‌ఎం లోకరాజు అన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ మండల విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలల సౌకర్యాలు, వసతులు, వారిపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఫిజియో థెరపిస్ట్ ప్రశాంతి ఐదుగురు దివ్యాంగ బాలలకు ఫిజియో అభ్యసనాలు నిర్వహించారు.

సాగులో సాంకేతికత అవసరం

చాట్రాయి: వ్యవసాయంలో రైతులు సాంకేతికతను వినియోగించుకోవాలని వ్యవసాయ అధికారి బి. శివశంకర్ అన్నారు. కొత్తగూడెంలో డ్రోన్ సహాయంతో పురుగు మందులు పిచికారీ చేయడాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో డ్రోన్ ద్వారా పలు రకాల వ్యవసాయ పనులను చేయవచ్చని వివరించారు.

నులి పురుగుల మాత్రల పంపిణీ

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం పీహెచ్‌సీ వైద్యాధికారి జాస్తి జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ మాత్రలను వేసుకోవలసిన ఆవశ్యకతను ఆయన విద్యార్థులకు వివరించారు. ఎంపీహెచ్‌ఈఓ రత్నబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాయంలోనూ చిన్నచూపు

- వరద ముంపునకు ధ్వంసమైన తాత్కాలిక నివాసాలు
- ఇటుక బట్టీలపైకి ఎక్కి ప్రాణాలు దక్కించుకున్న కార్మికులు
- మూడు రోజులు ఆహారం లేకుండానే గడిపిన వైనం
- ఇప్పటికీ వలస కార్మికులకు అందని ప్రభుత్వ సాయం



వరద ముంపుతో వెల్లటూరు శివారులో ఇటుక బట్టీపై నివాసం ఏర్పాటు చేసుకున్న కార్మికులు

జి.కొండూరు: ఇటుక బట్టీలలో పనిచేసేందుకు ఒడిశా నుంచి వచ్చిన వలస కార్మికుల ఇళ్లల్లోకి గత నెల 31న బుడమేరు వరద నీరు చేరింది. బట్టీల పైకి ఎక్కి ప్రాణాలు దక్కించుకున్నారు. కొందరైతే బట్టీలపైనే తాత్కాలిక నివాసాలను సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఎక్కడికక్కడ రహదారులు ధ్వంసమై, వాగులు పొంగి పొర్లడంతో బట్టీల వైపు అధికారులు కానీ, ఆయా గ్రామాల ప్రజలు కానీ వెళ్లేందుకు కూడా వీలు లేకపోవడంతో కార్మికులు వారం రోజులపాటు బట్టీలపైనే ఉన్నారు. ఉన్న కొద్దిపాటి ఆహారం, తాగునీటితోనే జీవనం గడిపారు. వరద ముంపు తగ్గి రాకపోకలు పునరుద్ధరణ జరిగిన తర్వాత విజయవాడ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే బట్టీల యజమానులు వచ్చి ఇచ్చిన నిత్యావసరాలే వారికి దిక్కయ్యాయి. వలస కార్మికులమనే చిన్నచూపుతో మమ్మలను ఎవరూ పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు.

రెండు వేల మందికి పైగా కార్మికులు

మైలవరం నియోజకవర్గంలోని మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలో 250 మందికి పైగా వ్యాపారులు బట్టీలను నిర్వహిస్తున్నారు. ఇటుకల తయారీ పూర్తవడంతో 90 శాతానికి పైగా కార్మికులు తమ సొంత ఊర్లకు వెళ్లిపోయారు. తయారైన ఇటుకలను విక్రయించుకునే సమయం కావడంతో ఇటుకలను లోడింగ్, అన్ లోడింగ్ చేసేందుకు మాత్రమే ఒడిశాకు చెందిన కార్మికులు ఒక్కొక్క బట్టీలో పదిమంది వరకు ఉన్నారు. ఈ బట్టీలలో మొత్తంగా 2 వేలకు పైగా కార్మికులు ఉండవచ్చని అంచనా.

విష పురుగులతో సహవాసం

వరద ముంపు నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న కార్మికులను ముంపు తెచ్చిన కష్టాలు వెంటాడుతున్నాయి. విష పురుగుల సంచారంతో పాటు వరద ముంపునకు గురైన ఇళ్లల్లోనే ఉండాల్సి రావడంతో వ్యాధులు వచ్చే అవకాశం ఉందని భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే సీజనల్‌గా వచ్చే వ్యాధులతో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వరద ముంపుతో కొత్తరకం వ్యాధులు ఏమన్నా సోకితే తమను పట్టించుకునే నాథుడే ఉండడని వాపోతున్నారు.

అందని సాయం

వరద ముంపు ప్రాంతాల్లో నిత్యావసరాల పంపిణీ పేరుతో నానా హడావిడి చేస్తూ ఫొటోలకు ఫోజులిస్తున్న టీడీపీ నేతలు, అధికారులు వలస కార్మికులను పట్టించుకోవడం లేదు. కనీసం అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో వారు వారం రోజులపాటు నరకయాతన అనుభవించారు. ఇప్పటికి కూడా ప్రభుత్వం నుంచి వీరికి నిత్యావసరాలు అందలేదు.



వెల్లటూరు శివారులో బట్టీలలో వరద ప్రవాహానికి ధ్వంసమైన కార్మికుల తాత్కాలిక నివాసాలు

మూడు రోజులు తిండి లేకుండానే



వరద ఒక్కసారిగా వచ్చి పడడంతో చేసేదిలేక బట్టీ పైకి ఎక్కి ప్రాణాలు దక్కించుకున్నాం. మా వైపు చూసే వాళ్లే లేకపోవడంతో నరకయాతన అనుభవించాం. మా యజమాని వచ్చి సరుకులు ఇచ్చే వరకు మాకు మూడు రోజులపాటు తినడానికి తిండిలేదు. తాగటానికి నీరులేదు.

– సుశీల, ఒడిశా కార్మికురాలు, వెల్లటూరు

పాల ప్యాకెట్ ఇవ్వనన్నారు



వరద వలన నరకయాతన అనుభవించాం. కందులపాడు గ్రామంలో పాలు పంపిణీ చేస్తున్నప్పుడు మా అబ్బాయి వెళ్లి ఒక్క పాల ప్యాకెట్ ఇవ్వమని అడిగితే ఇవ్వనని చెప్పారు. మూడు రోజులపాటు ఏమీ తినకుండానే బతికాం. మా ఓనర్ వచ్చి సరుకులు ఇచ్చే వరకు దిక్కులేదు.

– సుబానా కొపాట్, ఒడిశా కార్మికురాలు, వెల్లటూరు

ఎవ్వరూ, ఏమీ ఇవ్వలేదు



వరద ముంపులో నుంచి బయటపడిన తర్వాత మా ఓనర్ వచ్చి సరుకులు ఇచ్చారు. అధికారులు ఎవరూ మాకు ఇప్పటి వరకు ఏమీ ఇవ్వలేదు. ఇంట్లో సామాన్లు, సరుకులు అన్నీ తడిచిపోయి ఇబ్బంది పడుతున్నాం. అందరికీ ఇచ్చినట్లే మాకూ నిత్యావసరాలు పంపిణీ చేయాలి.

– సబిత బుయ్, ఒడిశా కార్మికురాలు, వెల్లటూరు

పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం

నూజివీడు: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఈఓపీఆర్డీ టి. సరస్వతి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మర్రిబంధం, పల్లెర్లమూడి, పోలసానపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం ర్యాలీలు, విద్యార్థులతో మానవహారాలు నిర్వహించారు. మర్రిబంధంలో ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. మాజీ సర్పంచి వడ్లాది త్రినాథరావు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

- ముసునూరు: కాలుష్య సమస్యలను తొలగించి, గ్రామాలను పచ్చదనంతో తీర్చిదిద్దే లక్ష్యంతో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి నాంది పలికామని ఎంపీడీఓ జి.రాణి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామ సచివాలయాల వద్ద సర్పంచ్‌ల అధ్యక్షతన మంగళవారం గ్రామ సభలు నిర్వహించి, కార్యాలయాల పరిసరాలను శుభ్రం చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత కోసం చేపట్టే అన్ని కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. కొర్లగుంట, బలివే పారిశుద్ధ్య కార్యక్రమాల్లో ఈఓపీఆర్డీ శ్రీనివాస్, ఏఈలు దుర్గాప్రసాద్, సత్యప్రసాద్, సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

తిరువూరురూరల్: తిరువూరు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు జరిగాయి. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతామని, పరిసరాల పరిశుభ్రత పాటిస్తామని సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. మల్లేల, ఆంజనేయపురం, గానుగపాడు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచులు వంగూరి మరియమ్మ, మామిడి కుటుంబరావు, పంచాయతీ కార్యదర్శి ఫణిగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

చాట్రాయి: చాట్రాయిలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మానవహారం నిర్మించారు. ఎంఈఓ బ్రహ్మాచారి, ఈఓపీఆర్‌డీ నాగరాజు, హైస్కూల్ హెచ్‌ఎం కృష్ణయ్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



మర్రిబంధంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



మల్లేలలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, సిబ్బంది

- విస్సన్నపేట: స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ, మానవహారం, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ర్యాలీలో ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, పంచాయతీ ఈఓ హరికృష్ణ కుమార్, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.
- ఆగిరిపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానవహారం నిర్మించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ అబ్దుల్ సలాం పాల్గొని మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో మానహారాలు, ర్యాలీలు, ప్రతిజ్ఞలు నిర్వహించామని ఆయన తెలిపారు. ఈఓపీఆర్డీ శేఖర్, వైద్యాధికారి జగన్‌మోహన్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ యోహాన్ తదితరులు పాల్గొన్నారు.



విస్సన్నపేట ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ, అధికారులు

ఘనంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం



చెక్కపల్లిలో విశ్వకర్మ జయంతి వేడుకలు



విస్సన్నపేటలో పూజల్లో పాల్గొన్న నాయకులు



ఆగిరిపల్లిలో పూజల్లో పాల్గొన్న నాయకులు

మైలవరం: మైలవరం రాజాపేటలోని శ్రీకంచి కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామి వారి దేవస్థానంలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘీయుల ఆధ్వర్యంలో శ్రీకంచి కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామికి భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- విస్సన్నపేట: విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం విస్సన్నపేట మండల విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. భక్తులు స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక సత్తుపల్లి రోడ్డులోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అన్నప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది.
- తిరువూరు: భగవాన్ విశ్వకర్మ జయంతి కార్యక్రమం స్థానిక భవన నిర్మాణ కార్మికుల సంఘ భవనంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశ్వకర్మ చిత్రపటానికి ప్రత్యేక పూజలు, శాంతిహోమం జరిపారు. విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చామర్తి రాంబాబు, పమ్మి బ్రహ్మచారి, కోశాధికారి రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.
- ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు అరిగే పిచ్చయ్య చారి మాట్లాడుతూ విశ్వకర్మ విశ్వానికి మూల విరాట్ అని పంచ వృత్తుల వారికి ఆరాధ్య దైవం అని చెప్పారు. విశ్వబ్రాహ్మణ సంఘ కోశాధికారి అద్దంకి వీర బ్రహ్మాచారి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.
- ముసునూరు: విశ్వకర్మ సేవా సంఘం ఆధ్వర్యంలో చెక్కపల్లిలో విశ్వకర్మ చిత్రపటానికి నాయకులు, వృత్తిదారులు పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్వకర్మ సేవా సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కొండపర్వ హరినాథ్, కూరెళ్ల నాగాచారి, సమరసత సేవా ఫౌండేషన్ ప్రచారక్ పరమేశ్వరరావు, గ్రామ ప్రచారక్ మల్లవల్లి కోటేశ్వరరావు, చేతి వృత్తిదారుల సంఘ నేతలు సజ్జనపు పుల్లాచారి, భాస్కర్, నాగాచారి, గూడూరు రంగారావు పాల్గొన్నారు.

రేపు మెగా వైద్యశిబిరం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధి ముత్తవరపు కల్యాణ మండపంలో గురువారం ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశామని గురిజాల లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోడూరు మనోజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మిత్ర, ప్రత్యూష మల్టీ స్పెషాలిటీ వైద్యశాల వైద్యులు జనరల్, స్త్రీలు, ప్రసూతి వైద్య విభాగంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. గుండె, కిడ్నీ, కళ్లు, దంతాలు, ఎముకల పటుత్వ పరీక్షలు చేస్తారని చెప్పారు.

నేడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

విస్సన్నపేట: లయన్స్ క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్, ఆంధ్రా హాస్పటల్ సౌజన్యంతో బుధవారం ఉదయం స్థానిక లయన్స్ క్లబ్ మల్టీ హాల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షుడు వి. కిరణ్ మంగళవారం తెలిపారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని చెప్పారు.

పలు ప్రాంతాల్లో అన్న సమారాధనలు



నూజివీడులో అన్నదానం



మైలవరంలో అన్నదానంలో పాల్గొన్న దాతలు, భక్తులు

నూజివీడు: పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లోని కంచి కామాక్షి అమ్మవారి ఆలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు మేకల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి వేడుకల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు మేకా నాగ వేణుగోపాల అప్పారావు (చంటినాయన) ప్రారంభించారు. తొలుత కంచి కామాక్షి అమ్మవారిని, వినాయకుడిని దర్శించుకొని పూజలు చేశారు. కౌన్సిలర్ మేకల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

- మైలవరం: మైలవరం శివాజీ వీధిలో ఏర్పాటు చేసిన చలువ పందిట్లో వినాయకునికి భక్తులు మంగళవారం పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

విస్సన్నపేట: లంబాడీతండా గ్రామంలో ఉపాధి హామీ పథకంలో హార్టీకల్చర్ పంట సాగును ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. గ్రామ సర్పంచ్ దారావతు బోడి, ఏపీఓ అనురాధ, ఈసీ దాసు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇవ్వాలి

నూజివీడు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను వ్యాయామంలోనే కాకుండా ఆటలు, క్రీడల్లో సైతం నిష్ణాతులను చేయాల్సిన బాధ్యత వ్యాయామోపాధ్యాయులదేనని ఎంఈఓ-2 జమలయ్య అన్నారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో ముసునూరు, చాట్రాయి, నూజివీడు, ఆగిరిపల్లి మండలాల్లోని వ్యాయామోపాధ్యాయులకు మంగళవారం స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్‌ను నిర్వహించారు. ఎంఈఓ-2 మాట్లాడుతూ ప్రతి నెలా నిర్వహించే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు వ్యాయామోపాధ్యాయులు హాజరు కావాలన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందింప జేయడంతో పాటు క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. కాంప్లెక్స్ చైర్మన్ బి. హేమలత, నియోజకవర్గ స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ రవీంద్ర, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దాతల సాయం



ఫెర్రీలో అన్నదానం చేస్తున్న తులసి పద్మశ్రీ



వంట సామగ్రి అందజేస్తున్న త్రివిధ హైస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం: ఫెర్రీలోని వరద బాధితులు 500 మందికి విజయవాడకు చెందిన వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు తలసి పద్మశ్రీ మంగళవారం అన్నదానం చేశారు. కొటికలపూడిలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు. ప్రధాన కార్యదర్శి చాంద్ బాషా, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు సెయింట్ జేవియర్ పాఠశాల విద్యార్థులకు బుక్స్ అందజేశారు. ఫెర్రీ విజయశక్తి విద్యాలయంలో పూర్వ విద్యార్థుల సౌజన్యంతో 260 మందికి ఎంఈఓ సీహెచ్ పుష్పలత నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

- నూజివీడు: వరద బాధితులకు మంగళవారం పట్టణంలోని త్రివిధ హైస్కూల్ విద్యార్థులు వంట సామగ్రి, దుప్పట్లు, దిండ్లను ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో వరద ముంపునకు గురైన 20 నిరుపేద కుటుంబాలకు నియోజకవర్గంలోని వ్యాయామోపాధ్యాయులు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఎస్ఆర్ఆర్ హైస్కూల్ హెచ్‌ఎం బి. హేమలత, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.
- తిరువూరు: వరద బాధితుల సహాయార్థం తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పగిడిపల్లి సత్యనారాయణ రూ.10 వేల విలువగల చెక్కును తహసీల్దార్ కె. లక్ష్మికి మంగళవారం అందజేశారు.

మృతుని కుటుంబానికి చెక్కు అందజేత

తిరువూరు: వామకుంట్లలో పాల ఉత్పత్తిదారు వంగల గోవర్ధన్ ఇటీవల మృతిచెందాడు. కృష్ణా మిల్క్ యూనియన్ నుంచి మంజూరైన రూ.లక్ష విలువగల చెక్కును మంగళవారం మృతుడి కుటుంబానికి అందజేశారు. లక్ష్మీపురం పాలశీతల కేంద్ర మేనేజర్ సాంబశివమూర్తి, యూనియన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ విజేతకు అభినందన

తిరువూరు: రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తిరువూరు నాగార్జున స్కూల్ విద్యార్థిని వి. సువర్ణ ప్రథమస్థానంలో నిలిచింది. ఈ నెల 14, 15 తేదీల్లో అమలాపురంలో జరిగిన పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా తరఫున ఆమె పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. విద్యార్థినిని పాఠశాల కరస్పాండెంటు నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ నరసింహారావు, డైరెక్టర్లు హనుమంతరావు, శేషగిరి, సూరిబాబు అభినందించారు.